క్లుప్తంగా...

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

శామీర్‌పేట్: లక్ష్మాపూర్ సబ్ స్టేషన్ పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ శ్రీనివాస్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా సబ్ స్టేషన్ పరిధిలోని లక్ష్మాపూర్, నారాయణపూర్ గ్రామాలతో పాటు వ్యవసాయ పొలాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్ర 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు వివరించారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక



బీఆర్‌ఎస్ కండువా కప్పుతున్న మంత్రి మల్లారెడ్డి

ఘట్‌కేసర్: కొర్రెముల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు పంచాయతీ వార్డు సభ్యులు స్వామి, బాబు మంగళవారం మంత్రి మల్లారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. బోయిన్‌పల్లిలోని క్యాంపు కార్యలయంలో మంత్రి వారికి కండువాల కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు ఎరుకల దుర్గరాజ్, నాయకులు కోళ్ల యాదగిరి, సురేందర్‌రెడ్డి, నాగేశ్‌గౌడ్, గొబ్బురి మన్నెం ముదిరాజ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఓటుపై పోటీలు

సాక్షి, మేడ్చల్ జిల్లా: యువ ఓటర్లలో చైతన్యంతో కూడిన అవగాహన కోసం 'ఓటు హక్కు, స్వేచ్ఛాయుత ఎన్నికలు' తదితర అంశాలపై మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని అన్నీ పాఠశాలలు/కళాశాలల్లోని విద్యార్థులతో స్కిట్(సాంస్కృతిక) కార్యక్రమం, పద్య రచన, పాటల రచనలు నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారి పద్మజారాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు తమ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు/ కాలేజీ ప్రిన్సిపాళ్ల ద్వారా పేరు నమోదు చేయించుకొని స్కిట్, పద్య రచన, పాటల రచనలను ప్రదర్శించవచ్చని అన్నారు. ఉత్తమ స్కిట్లకు రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.5 వేలు, ఉత్తమ పద్య రచన, పాటల రచనలకు బహుమతులు ఇస్తామని తెలిపారు.

ఓటును వినియోగించుకోవాలి

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని జెడ్పీహెచ్‌ఎస్ జవహర్‌నగర్ పాఠశాలలో స్వీప్ (సిస్టమెటిక్ ఓటర్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్) ఆధ్వర్యంలో మంగళవారం ఓటరు నమోదుపై తమ కుటుంబ సభ్యులకు తెలిపేందుకు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్వీప్ సభ్యులు మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండిన విద్యార్థులు, యువతీయువకులు ఓటు నమోదు చేసుకోవాలని, ఓటు పొందిన వారు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఎల్‌వో సూపర్‌వైజర్ పాండు, మెంపా కో–ఆర్డినేటర్ భార్గవి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

పోచారం: అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన అన్నోజిగూడలో జరిగింది. పోచారం పోలీస్ స్టేషన్ సీఐ అశోక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అన్నోజిగూడకు చెందిన నానావత్ శుక్రు(70) 13 ఏళ్లుగా ఆస్తమాతో పాటు కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఇంట్లో ఒంటిగా ఉన్న సమయంలో బాత్‌రూమ్‌లోని ఇనుప కడ్డీకి చున్నీతో ఉరేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వైద్యం కోసం ఘట్‌కేసర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు గుర్తించారు. మృతుడి కొడుకు వినోద్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఘట్‌కేసర్: వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి తరలిస్తుండగా గుర్తు తెలియని ఓ వ్యక్తి ఘట్‌కేసర్‌లో మంగళవారం మరణించాడు. అడ్మిన్ ఎస్సై అశోక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని ప్రభుత్వ సిబ్బంది ఇచ్చిన సమాచారంతో ఘటన స్థలానికి చేరుకోగా మాట్లాడలేని స్థితిలో ఉన్న ఓ గుర్తు తెలియని వ్యక్తి(35) ఉన్నాడు. పోలీస్ పెట్రోల్ సిబ్బంది అతడికి ప్రథమ చికిత్స చేశారు. ఆరోగ్యం విషమంగా ఉందన్న అక్కడి వైద్యుల సలహా మేరకు గాంధీ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించాడు. దీంతో మృతదేహాన్ని గాంధీ మార్చురీలో భద్రపరిచారు. అతడి గురించి తెలిపిన వారు ఘట్‌కేసర్ పీఎస్‌ను సంప్రదించాలన్నారు. గుర్తు తెలియని వ్యక్తి మృతిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

బఫర్ జోన్‌లో నిర్మాణాలను ఆపాలి

బోడుప్పల్: 20వ డివిజన్ పరిధిలోని సుద్ధకుంట బఫర్ జోన్‌లో కొనసాగుతున్న నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం న్యూసాయి మారుతీనగర్ అధ్యక్షులు పి.నర్సింగ్‌రావు, ప్రధాన కార్యదర్శి రవీందర్‌రెడ్డి, కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. బఫర్ జోన్‌లో 400 గజాల స్థలంలో ప్రహరీ గోడను నిర్మిస్తున్నారని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో కోరారు.

పోషకాహారం.. ఆరోగ్యానికి సోపానం



ఈ నెలాఖరు వరకు పోషణ మాసోత్సవం

- మహిళలు, చిన్నారుల ఆరోగ్యమే లక్ష్యం
- పోషకాహారం తీసుకొనేలా ప్రోత్సాహం
- శివారు జిల్లాల సంక్షేమ శాఖల కార్యాచరణ
- ఈ నెలాఖరు వరకు అవగాహన సదస్సులు

సాక్షి, మేడ్చల్ జిల్లా: మహిళలు, చిన్నారుల్లో పోషకాహార స్థితిని మెరుగుపర్చాలనే లక్ష్యంతో పోషణ మాసోత్సవాన్ని చేపట్టారు. తద్వారా ఆరోగ్యకరంగా జీవించేందుకు బాటలు వేసేందుకు జిల్లా సంక్షేమ శాఖ చర్యలు తీసుకుంటోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విషయంలో పలు పథకాలను కూడా అమలు చేస్తున్నాయి. చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందించేందుకు ప్రాధాన్యం ఇస్తున్నాయి. నగరంతో సహా శివారు జిల్లాలైన మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డిలలో పోషకాల లోపంతో సతమవుతున్న చిన్నారులు ఇప్పటికీ చాలా మంది ఉన్నారు. పోషకాలపై అవగాహన కల్పించి, పథకాలను సద్వినియోగం చేసుకోవడానికి అవకాశం కల్పించే మాసోత్సవాన్ని పోషణ్ అభియాన్ పేరుతో ఈ నెలాఖరు వరకు ఆయా జిల్లా సంక్షేమ శాఖలు నిర్వహిస్తున్నాయి.

ఇదీ లక్ష్యం..

స్వచ్ఛంద సంస్థలు, పాఠశాలలు, ప్రజల భాగస్వామ్యంతో సంపూర్ణ ఆరోగ్యవంతమైన సమాజమే లక్ష్యంగా ఈ నెలాఖరు వరకు వివిధ కార్యక్రమాలతో తల్లిదండ్రులను చైతన్యం చేస్తారు. పోషకాహార లోపం లేని తెలంగాణగా తీర్చిదిద్దాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమాలకు రూపకల్పన చేశారు.

- గర్భిణులు మిటమిన్లు, ఐరన్ సమృద్ధిగా ఉన్న వివిధ రకాల పోషకాహారం ఎలా తీసుకోవాలో అవగాహన కల్పిస్తారు.

బహుమతుల ప్రదానం

పోషణ మాసోత్సవంలో భాగంగా నగరంతో సహా శివారు జిల్లాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు, పురపాలక సంఘాలు, గ్రామపంచాయతీల్లో పిల్లల ఎత్తు, బరువు చూస్తారు. ఆరోగ్యంగా ఉన్న పిల్లలకు బహుమతులు అందజేస్తారు. రక్తహీనత శిబిరాలు నిర్వహించి, పోషకాహారంపై అవగాహన కల్పిస్తారు. ఈ సంవత్సరాన్ని చిరుధాన్యాల సంవత్సరంగా గుర్తించటం వల్ల.. మాసోత్సవాల్లో ఈ అంశానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. చిన్నారులకు నిత్యం పోషక విలువలతో కూడిన ఆహారం అందించేందుకు పాలు, పండ్లు సూచిస్తున్నారు. యువజన, మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తారు.

బరువు లేని చిన్నారులపై ప్రత్యేక దృష్టి

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా పోషణ మాసోత్సవాన్ని షెడ్యూలు ప్రకారం నిర్వహిస్తున్నాం. చిన్నారులు ఆరోగ్యంగా ఎదగాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకుసాగుతోంది. మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న మాసోత్సవం సజావుగా సాగేలా చూస్తున్నాం. వయస్సుకు తగ్గ బరువులేని చిన్నారులపై ప్రత్యేక దృష్టి పెడుతున్నాం. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందేలా చూస్తున్నాం. నిత్యం పాలు, పండ్లు, కూరగాయలు, చిరుధాన్యాలను ఆహారంలో చేర్చడం ద్వారా ఉండే ప్రయోజనాలపై వారికి వివరిస్తున్నాం.

– కృష్ణారెడ్డి, జిల్లా సంక్షేమాధికారి, మేడ్చల్–మల్కాజిగిరి.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- వినాయక చవితి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు
- అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి



సాక్షి, మేడ్చల్ జిల్లా: ఈ నెల 18 నుంచి జరిగే వినాయక చవిత ఉత్సవాలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. సంబంధిత అధికారులు సమన్వయంతో కార్యాచరణ ప్రణాళిక ప్రకారంతో ముందుకు సాగాలని పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో భాగ్యనగర్ ఉత్సవ కమిటీ సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. వినాయక నిమజ్జనానికి సంబంధించి జిల్లావ్యాప్తంగా 17 చెరువులు ఉండగా, ఇందులో గ్రేటర్ హైదరాబాద్(జీహెచ్‌ఎంసీ) పరిధిలో 11 చెరువులు ఉన్నాయని తెలిపారు. నిమజ్జనానికి రూట్ మ్యాప్ సిద్ధం చేసుకొని, రోడ్డు మరమ్మతులను వెంటనే చేపట్టాలని సూచించారు. ప్రతి గణేష్ మండపం వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. నిమజ్జన ప్రదేశాల్లో అధిక సంఖ్యలో గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని జిల్లా మత్స్య శాఖ అధికారికి సూచించారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షిస్తుండాలన్నారు. ఎటువంటి ఘటనలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, మల్కాజిగిరి డీసీపీ గిరిధర్, ఆర్డీఓలు, భాగ్యనగర్ ఉత్సవ కమిటీ సభ్యులు, జిల్లాస్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ నర్సింహారెడ్డి

గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

మేడ్చల్‌రూరల్: గణేశ్ ఉత్సవాలను ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా, ఆనందంగా జరుపుకోవాలని మేడ్చల్ సీఐ నర్సింహారెడ్డి అన్నారు. వినాయక చవితి పురస్కరించుకుని మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చవితి రోజు నుంచి నిమజ్జనం వరకు అందరూ కలిసి మెలిసి ప్రశాంత వాతావరణంలో పండగను జరుపుకోవాలన్నారు. వినాయక మండపాల్లో లడ్డూ, అఖండ దీపం, తదితర విషయాల్లో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సమావేశంలో ఎస్‌ఐ నర్సింహాగౌడ్, సిబ్బంది, ఉత్సవ కమిటీ సభ్యులు, పలు పార్టీల నాయకులు, మండలంలోని పలు యువజన సంఘాలు, యువకులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి



బొమ్మరాశిపేటలో గ్రామస్తులకు ఇళ్ల పట్టాలను అందజేస్తున్న మంత్రి మల్లారెడ్డి

శామీర్‌పేట్: రాష్ట్రంలోని నిరుపేదల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తుందని కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. శామీర్‌పేట మండలం బొమ్మరాశిపేట గ్రామస్తులకు 345 మందికి ఇంటి స్థలం పట్టాలను మంగళవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు పట్టాలు ఇచ్చారు కానీ స్థలం చూపించకుండా పేద ప్రజలను మోసం చేశాయని, బీఆర్‌ఎస్ ప్రభుత్వం పక్కా పట్టాలతో పాటు స్థలంలో ఇల్లు కట్టుకుంటే గృహలక్ష్మీ పథకం ద్వారా రూ.3 లక్షలు మంజూరు చేస్తామని మంత్రి మల్లారెడ్డి బొమ్మరాశిపేట గ్రామస్తులకు హామీ ఇచ్చారు. సీఎం కేజీఆర్, రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల ఆర్థిక అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అనిత, స్థానిక ఎంపీటీసీ ఇందిర, సర్పంచ్ గీత, తహసీల్దార్ శ్రీనివాస్, పలువురు అధికారులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అందరికీ మెరుగైన వైద్యమే బీఆర్‌ఎస్ సంకల్పం



దమ్మాయిగూడలో ఆరోగ్య మహిళ క్లినిక్ ప్రారంభిస్తున్న మంత్రి మల్లారెడ్డి

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని రాజీవ్ గృహకల్ప కాలనీలో ఆరోగ్య మహిళ క్లినిక్‌ను కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఎస్‌పీసీ సంస్థ ద్వారా మహిళలకు 30 కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అందరికీ మెరుగైన వైద్యం అందాలన్న సంకల్పంతో ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిందన్నారు. కార్యక్రమంలో చైర్ పర్సన్ వసుపతి ప్రణీత శ్రీకాంత్, డీఎంహెచ్‌ఓ డా.పుట్ల శ్రీనివాస్, కమిషనర్ రాజ మల్లయ్య, ఎస్‌పీసీ సంస్థ డైరెక్టర్ రాజిరెడ్డి, సత్యనారాయణ, కృష్ణారెడ్డి, డాక్టర్ సరిత, సాయి ఆకాంక్ష, వెంకన్న, కౌన్సిలర్లు రామారం శ్రీహరిగౌడ్, నాను నాయక్, నాగయిపల్లి సుజాత, కొత్త హేమలత పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీలోని 1వ వార్డులో చేపట్టిన సీసీ రోడ్డు పనులను చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.15 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో సీసీ రోడ్డు నిర్మిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బండారి మల్లేష్ యాదవ్, స్థానిక కౌన్సిలర్ చింతల సరిత రమేష్, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు



మునీరాబాద్‌లో ప్రాథమిక పాఠశాలను పరిశీలిస్తున్న ఎన్నికల అధికారి

మేడ్చల్‌రూరల్: అసెంబ్లీ ఎన్నికల నిర్వహణలో భాగంగా మండలంలోని మునీరాబాద్ గ్రామంలో మంగళవారం ఎన్నికల అధికారులు ఏర్పాట్లను పరిశీలించారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఎన్నికల నిర్వహణ గదులను ఎన్నికల సెక్టార్ అధికారి సహజ గ్రామ సర్పంచ్ గణేశ్, సిబ్బందితో కలిసి పరిశీలించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో పలు వివరాలను సర్పంచ్, అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ప్రభుత్వ భూమి కబ్జా అవుతున్నా పట్టదా?



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

మేడ్చల్: మేడ్చల్ చెక్‌పోస్ట్ వద్ద గల ప్రభుత్వ భూమి కబ్జా అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని పట్టణ బీజేపీ నాయకులు ఆర్.శ్రీనివాస్‌గౌడ్, సీహెచ్.శ్రీనివాస్‌గౌడ్, మల్లేష్‌యాదవ్ అన్నారు. పట్టణంలోని చెక్‌పోస్ట్ వద్ద గల సర్వే నంబర్–846లో మినీస్టేడియం ఏర్పాటు చేసి మిగతా స్థలాన్ని టీఎస్‌ఐఐసీ వదిలేశారని, ఆ స్థలం కబ్జాలకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని అన్నారు. అధికారులు విలువైన స్థలాన్ని కాపాడాలని వారు కోరారు.

సెంట్రల్ లైటింగ్ సిస్టంను ఏర్పాటు చేయించాలి



కిషన్‌రెడ్డికి వినతి అందజేస్తున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, సర్పంచ్ కావేరి

ఘట్‌కేసర్:అవుషాపూర్‌లో జాతీయ రహదారిపై సెంట్రల్ లైటింగ్ సిస్టంను ఏర్పాటు చేయాలని స్థానిక ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, ఆ గ్రామ సర్పంచ్ కావేరిమశ్చేందర్‌రెడ్డి, కేంద్ర మంత్రి, టీబీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి మంగళవారం వినతి పత్రం అందజేశారు. గ్రామంలో మంత్రిని కలిసి పెండింగ్‌లో ఉన్న నేషనల్ హైవే 163 వద్ద ఫ్లైఓవర్ పనులను వేగవంతం చేయాలని కోరారు.

అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులకు గుర్తించాలి



అంగన్‌వాడీల సమ్మెకు సంఘీభావం తెలుపుతున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, శోభారాణి

ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులగా గుర్తించి కనీస వేతనం రూ.26 వేలు అందజేయాలని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఎంపీటీసీ శోభారాణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా అధ్యక్షురాలు సుచిత్ర అధ్యక్షతన చేపట్టిన నిరవధిక సమ్మెకు మంగళవారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీలకు బీఎల్వోలుగా డ్యూటీ వేయకూడదని, పెన్షన్, ఈఎస్‌ఐ సౌకర్యం, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కావేరి, మహిపాల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, మల్లేశ్, సబిత, అంగన్‌వాడీ టీచర్లు హైమావతి, పద్మ, వైశాలి పాల్గొన్నారు.

డ్రైనేజీని ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి

మల్లాపూర్: భూగర్భ డ్రైనేజీల్లో పేరుకుపోయిన మట్టి, చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అధికారులు, సిబ్బందికి సూచించారు. మంగళవారం న్యూభవానీగర్ కాలనీలో మట్టి తొలగింపు పనులను ఆయన పరిశీలించారు. అనంతరం మల్లాపూర్ ఓల్డ్ విలేజ్‌లో సీసీ రోడ్డు పనులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం సతీష్, మేనేజర్ సందీప్, ఏఈ స్రవంతి, వర్క్‌ఇన్‌స్పెక్టర్ భిక్షపతి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీనారాయణ చెరువు వద్ద ఏర్పాట్ల పరిశీలన



చెరువును పరిశీలిస్తున్న అడిషనల్ డీసీపీ సూర్యనారాయణరావు, సీఐ మహేందర్‌రెడ్డి

ఘట్‌కేసర్: ఎదులాబాద్‌లోని శ్రీలక్ష్మీనారాయణ చెరువును మల్కాజిగిరి ఎస్‌ఓటీ అడిషనల్ డీసీపీ సూర్యనారాయణరావు, సీఐ మహేందర్‌రెడ్డితో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా లైట్ల ఏర్పాట్లు, భారీకేడ్లు ఏర్పాట్లు, ట్రాఫిక్ తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీసుల వసతి ఏర్పాటుకు అనువైన స్థలాన్ని సందర్శించారు. సర్పంచ్ సురేశ్, ఉప సర్పంచ్ లింగేశ్వర్‌రావు, మాజీ ఎంపీటీసీ కుమార్ ముదిరాజ్, బాల్‌రాజ్ ముదిరాజ్, లింగంముదిరాజ్ పాల్గొన్నారు.

ఆరోగ్య తెలంగాణే సీఎం కేసీఆర్ లక్ష్యం



ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మేయర్ కావ్య, కార్పొరేటర్లు, వైద్యులు

జవహర్‌నగర్: ఆరోగ్య తెలంగాణే సీఎం కేసీఆర్ లక్ష్యమని మేయర్ మేకల కావ్య, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ అన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని అంబేడ్కర్‌నగర్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ కావ్య మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందుతుందన్నారు. మహిళల ఆరోగ్యానికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. ప్రతి మంగళవారం మహిళలకు ప్రత్యేకంగా ఆరోగ్య పరీక్షలతో పాటు మందులు అందజేస్తోందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఏకే.మురుగేష్, నాగరాణివెంకటేష్‌గౌడ్, ఎల్ల శ్రీనివాస్‌రెడ్డి, వైద్యులు సుష్మ, హరినాథ్, శైలేష్, ఆరోగ్య విస్తరణాధికారి షౌకత్ అలీ, ఆశ వర్కర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎల్లంపేట్‌లో పర్యటించిన డీఎల్‌పీఓ



ఎల్లంపేట్‌లో పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ

మేడ్చల్‌రూరల్: మండలంలోని ఎల్లంపేట్ గ్రామంలో మంగళవారం డీఎల్‌పీఓ స్మిత పర్యటించారు. గ్రామ పాలక వర్గ సభ్యులతో కలిసి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, గ్రామంలోని పలు వీధులను సందర్శించి పారిశుద్ధ్య నిర్వహణ తీరును పరిశీలించారు. పంచాయతీ సిబ్బందికి ఆదేశాలు జారీ చేసి పరిసరాలను శుభ్రం చేయించారు. గ్రామంలోని చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించాలని, వర్షాకాలం సందర్భంగా కుంటలలో వర్షపు నీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలని, దోమలు వ్యాప్తించి ఫాగింగ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వెన్నెల రామకృష్ణుడు, ఉపసర్పంచ్ గణేశ్, వార్డు సభ్యులు రమేష్ యాదవ్, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు నగదు బహుమతులు అందజేస్తున్న శశిధర్‌రెడ్డి

ఘనంగా ఫ్రెషర్స్‌డే

మేడ్చల్: పట్టణంలోని ఎస్ఎస్ఆర్ జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డేని ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కళాశాలలో గత సంవత్సరం మెరుగైన ర్యాంకులు సాధించిన విద్యార్థులకు కళాశాల చైర్మన్ శశిధర్‌రెడ్డి రూ.5 వేల నగదు ప్రోత్సాహక బహుమతి అందజేశారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్య సభ్యులు విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.